క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు అందజేత



బీమా నగదు అందజేస్తున్న పీఎస్ సురేష్, నాయకులు శేఖర్‌రెడ్డి

సీఎస్‌పురం(పామూరు): వైఎస్సార్ బీమా పేదలకు వరం లాంటిదని సర్పంచ్ అంబాల లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి సురేష్ అన్నారు. మండలంలోని రెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన మేకల చిన్న వెంగయ్య (46) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ బీమాలో భాగంగా మట్టిఖర్చుల నగదును మృతుని భార్య అరుణకు అందజేశారు. ఉపసర్పంచ్ దుద్దుకూరి శ్రీను, అంబాల శేఖర్‌రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఖాదర్‌బాషా, దానం, రాధ పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్క నాటిన ఎంపీపీ

మర్రిపూడి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణ, బస్టాండ్ సెంటర్ తదితర ప్రదేశాలల్లో ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. ఏవో ఎస్కే ఖాశింపీరా, సీనియర్ అసిస్టెంట్ ఎస్కే షుకూర్, రాఫా, ఇనుకొల్లు మాదిరెడ్డి, మాదవ, ప్రసాద్ ఉన్నారు.

50 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హోర్స్ సంస్థ సభ్యులు

గుడ్లూరు: స్థానిక ఎస్సీ కాలనీలో హెల్పింగ్ హోర్స్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు తూటి విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో 50 మంది వృద్ధులకు రూ 15 వేలు విలువైన దుప్పట్లును అందచేశామన్నారు. సొసైటీ ద్వారా వృద్ధులు, అనాథలు, దివ్యాంగులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ కార్యదర్శి జాకోబ్ ప్రసాద్, బీఆర్ మణి, సంస్థ జిల్లా అధ్యక్షుడు పాస్టర్ కృపారావు, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

90 మందికి వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సంధ్య

హనుమంతునిపాడు: మండలంలోని లింగంగుంట్ల పంచాయతీలో జరిగిన ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో సోమవారం డాక్టర్ సి.సంధ్య 90 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్య బీపీ, షుగర్, జ్వరం, దగ్గు, జలుబు తదితర సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రభుత్వం అందుబాటులో వైద్యసేవలు ఉంచేందుకే ఫ్యామిలీడాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సంధ్య అన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్



హాజరైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

కనిగిరి రూరల్ : కనిగిరి ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవానికి వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్ పిలుపునిచ్చారు. కనిగిరిలోని వైఎస్సార్ భవన్‌లో జరిగిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన సాల్మాన్‌రాజును మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నిక చేశారన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత పేద బడుగు బలహీన వర్గాల వారికి అన్ని కులాల వారికి మంచి మంచి పదవులు ఇచ్చి రాజకీయంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. 20వ తేదీన జరిగే సాల్మన్‌రాజు ప్రమాణస్వీకారానికి వేల సంఖ్యలో మాల, మాదిగ, ఇతర పేద బడుగు, బలహీన వర్గాల వారు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ప్రమాణ స్వీకారోత్సవం తదుపరి సెమీ క్రిస్మస్ వేడుకలు జరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి పాస్టర్‌కు దుస్తులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్లు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొనాలని కోరారు. అనంతరం జగనన్న అడ్వాన్స్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. స్థానికొమ్ము రంగనాయకులరెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్ గఫార్, హుస్సేన్‌రెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, భవనగిరి వెంకటయ్య, రాష్ట్ర మహిళా కార్యదర్శి తమ్మినేని సుజాత, జేసీఎస్ కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, మండల కన్వీనర్లు బొర్రారెడ్డి ఎక్కంటి శ్రీనివాసులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, ఎస్టి నాయకులు కౌన్సిలర్ శ్రీరాం సతీష్, వెలిగండ్ల సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, పువ్వాడి రాంబాబు, నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీమా నగదు అందజేత

పామూరు: స్థానిక డీసీపాలెంకు చెందిన మాచర్ల ఖాజామస్తాన్ అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడు వైఎస్సాఆర్ బీమాలో సభ్యుడు కావడంతో మృతుని కుటుంబసభ్యులకు సోమవారం వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు, ఉపసర్పంచ్ యాదాల సాయికిరణ్, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతాప్‌లు మట్టి ఖర్చుల కింద రూ.10 వేలను మృతుని భార్య సలీమాకు అందజేశారు. వార్డు సభ్యులు పఠాన్ రఫి పాల్గొన్నారు.



బీమా నగదు అందజేస్తున్న ఉపసర్పంచ్, వెల్ఫేర్ అసిస్టెంట్

సంక్షేమంతోనే ఆర్థికాభివృద్ధి



కందుకూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి



సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే

కందుకూరు రూరల్: సంక్షేమ పథకాలతోనే ప్రజలు ఆర్థికాభివృద్ధి చెందుతారని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 15వ వార్డు సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు ఆర్థికంగా నిలబడాలంటే వారికి సంక్షేమ ఫలాలు తప్పనిసరిగా అందించాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అమలు చేశారని తెలిపారు. కరోనా సమయంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పడికి ఎక్కడా కూడా వెనుకడుగు వేయకుండా సంపూర్ణంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేశారని కొనియాడారు. హామీ ఇచ్చిన పథకాలను ఏ ఒక్కటీ అందించకపోయినా తిరిగి మిమ్మల్ని ఓటు అడగనని చెప్పిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కేవలం నిరుపేదే అర్హతగా మధ్యవర్తులు, దళారులు లేకుండా లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 87శాతం కుటుంబాలు లబ్ధి పొందారని చెప్పారు. అదే విధంగా అర్బన్ ప్రాంతంలో 78 శాతం కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూర్చారో నేరుగా ఇళ్లకు వెళ్లి వారికి తెలియజేయాలని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు పెంచడం చారిత్రాత్మకమన్నారు. పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. అసైన్డ్ భూములను పూర్తి స్థాయి హక్కు కల్పిస్తూ హక్కుదారి పత్రాలను పంపిణీ చేశారని తెలిపారు. జగనే మా నమ్మకం కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే.రఫీ ఆవిష్కరించారు. జెసీఎస్ కన్వీనర్ ముప్పరపు కిషోర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పాశం కుమారి, పాశం కొండయ్య, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు జాజుల కోటేశ్వరరావు, గణేషం గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అయ్యప్ప పడిపూజ



పామూరులో అయ్యప్ప మెట్లపూజలో పాల్గొన్న భక్తులు

పామూరు: మండలంలో సోమవారం సుబ్రమణ్య షష్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్ప ఆలయంలో వేకువజామున సుబ్రహ్మణ్యేశ్వరుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు చిమట పట్టాభి, కార్తీక్‌ల ఆధ్వర్యంలో హరిహరసుతుడు అయ్యప్ప మూల విగ్రహమూర్తికి, పంచలోహ ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అదేవిధంగా మహాగణపతి హోమం నిర్వహించి తదుపరి స్వామివారి 18 మెట్లకు పూజలు నిర్వహించి పడిపూజ నిర్వహించారు. మాలధారులకు వైఎస్సార్ సీపీ నాయకులు, ఉపసర్పంచ్ దుద్దుకూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటుచేశారు. ఆలయ గౌరవాధ్యక్షుడు విశ్వనాథుని సత్యనారాయణ, చైర్మన్ గుత్తి వెంకట రాజా, అంబాల శేఖర్ రెడ్డి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

బడుగు,బలహీన వర్గాలకు సముచిత స్థానం



మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి

పామూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్ర మండల పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి ఏఎంసీ చైర్మన్‌గా ఈ నెల 20న బుధవారం కనిగిరిలో జరగనున్న ఏఎంసీ చైర్మన్ చింతగుంట్ల సాల్మన్‌రాజు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సముచిత స్థానం ఇస్తున్నారనడానికి సాల్మన్‌రాజు ఏఎంసీ చైర్మన్‌గా నియామకమే నిదర్శనమన్నాడు. కార్యక్రమంలో కో ఆప్షన్ నాయబ్‌రసూల్, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఎస్. నాయబ్‌రసూల్, బద్దిపూడి మార్కు, శ్రీరాం శ్రీను, పోతల రమేష్, సూరిపోగు మాల్యాద్రి, ఎలికా అచ్చయ్య, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, పుట్లూరి యోగీశ్వర రెడ్డి, చల్లా శివయ్య, పాలేటి ప్రేమ్, పలువురు పాల్గొన్నారు.

క్యాన్సర్ లాంటి వ్యాధులకు ఆరోగ్యశ్రీ సంతోషకరం

● ఎంపీపీ వాకా వెంకటరెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ఎంపీడీఓ సుదీప



సింగరాయకొండలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రియాంక

మర్రిపూడి: రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన జబ్బులకు ఆరోగ్యశ్రీ వర్తింపజేయడం సంతోషకరమని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ఎంపీడీఓ ఎస్.సుదీప పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ కార్డులపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికాలు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుదీప మాట్లాడుతూ.. పేదలకు ఆరోగ్యశ్రీ ఒక వరమన్నారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి ప్రమాదకరపు జబ్బులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల వరకు పెంచి ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. సచివాలయాల పరిధిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్యశ్రీకి అర్హులను గుర్తించాలని సిబ్బందికి సూచించారు. గ్రామ స్థాయిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏవో ఎస్కే ఖాశింపీరా, ఎంఈఓ రంగయ్య, సర్పంచ్ కె.భాస్కర్, ఇనుకొల్లు మాదిరెడ్డి, షుకూర్, రాఫా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా 25 లక్షల వరకు ఉచిత వైద్యం

కొండపి(సింగరాయకొండ): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకు ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తోందని వైద్యాధికారి పియాంక పేర్కొన్నారు. కొండపి మండలంలోని వెన్నూరు గ్రామ సచివాలయంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పూనాటి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో ఉపాధి అవకాశాలు



గుడ్లూరు : వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న అధికారులు

గుడ్లూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని ఎంపీడీఓ రాజశేఖరరావు అన్నారు.మండలంలోని నాయుడుపాలెం, చిన లాటరఫి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించి వాటి ద్వారా ప్రజలకు లబ్ధి కలిగేలా చర్యలు తీసుకొని వారు ఆర్థికంగా అభివృద్ధిని సాధించేలా చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. సర్పంచ్‌లు గంగవరపు సుజాత, మొగిలి శివపార్వతి, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, ఏఓ రవికుమార్, గృహనిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజశేఖర్, ఏపీఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పామూరు: మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ నెల 21 నుంచి జనవరి 2 వ తేదీ వరకు నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బందికి వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన చేసేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్

కనిగిరి రూరల్: జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గడపలోనూ సంక్షేమ వెలుగులేనని ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్‌యాదవ్ అన్నారు. వైఎస్సార్ భవన్‌లో 12, 15 వార్డుల సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు వార్డుల్లో ఎక్కువ మంది ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారేనని, జగనన్న రాష్ట్రంలో రాజకీయంగా ఎన్నో పదువులు ఇచ్చారన్నారు. కనిగిరిలో కూడా సాల్మన్ రాజును ఏఎంసీ చైర్మన్‌గా, మాణిక్యరావును మున్సిపల్ వైస్ చైర్మన్‌గా చేశారన్నారు. అటువంటి జగన్ననను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గతంలో ఈ వార్డులలో మనకు మంచి మెజార్టీ వచ్చిందని, ఈ సారి కూడా ఇంటింటికి వెళ్లి జగనన్న ఇచ్చిన పథకాలు గురించి వివరించాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వలంటీర్లను సమన్వయం చేసుకొని రోజుకు 2, 3 గంటలు ఈ మూడు నెలల పని చేసి అత్యధిక మెజార్టీ వచ్చేటట్లు పనిచేయాలన్నారు.

కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్ గఫార్, రంగనాయకులురెడ్డి, శ్యామ్, రవికుమార్, సుధాకర్‌రావు, రాజేష్, గురవయ్య, విజయభాస్కర్, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి



ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ఎంఈఓ-2 శ్రీనివాసరావు

సింగరాయకొండ: విద్యార్థుల్లో సాంకేతికతను పెంపొందించి యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ-2 ఆవుల శ్రీనివాసరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఈఓ-2 మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనలో వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 55 ఎగ్జిబిట్లు ప్రదర్శించారన్నారు. వ్యక్తిగత ప్రాజెక్టు విభాగంలో షేక్ హంషీరా(జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల), కె.లీలా మణికంఠ(ప్రభుత్వ ఉన్నత పాఠశాల), గ్రూపు ప్రాజెక్టు విభాగంలో ఎ.అక్షయ, పి.తేజోర్మయి(ఊళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), పి.లిఖిత గ్రేస్, టి.వైష్ణవి(కలికవాయ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల) విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జె.మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబానికి ఆర్థిక సాయం



మాల్యాద్రి పార్థివదేహానికి సంతాపాన్ని తెలియజేస్తున్న సంఘం సభ్యులు

కందుకూరు: పట్టణంలోని ముత్తరాసిపాలెంకు చెందిన మత్స్యకార సంఘం సీనియర్ సభ్యులు చింతరబోయిన మాల్యాద్రి అనారోగ్యం కారణంగా ఆదివారం రాత్రి తన నివాసంలో మృతి చెందాడు. మాల్యాద్రి పార్థీవదేహాన్ని సోమవారం ఉదయం మత్స్యకార సంఘం సభ్యులు నివాళులర్పించి సంతాపాన్ని తెలియజేశారు. మత్స్యకార సంఘం తరఫున మట్టి ఖర్చులకు పది వేల రూపాయిల ఆర్థిక సాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘంలోని సీనియర్ సభ్యుడైన మాల్యాద్రి ఆకస్మిక మరణం చాలా బాధాకరమని మత్స్యకార సంఘం అధ్యక్షుడు కొంగల నాగరాజు తెలిపారు. కందుకూరు మత్స్యకార సంగానికి ఆయన మృతి తీరని లోటని మాల్యాద్రి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రుద్రబోయిన నరశింగరావు, మోసంగి కోటేశ్వరరావు, పంది పోతురాజు, కొండెబోయిన శ్రీనివాసులు, రుద్రబోయిన రాజు, చింతరబోయిన నాగమల్లి, మోసంగి ప్రసాద్, పంది మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ప్రమాణస్వీకారానికి తరలిరావాలి

పీసీపల్లి: ఈ నెల 20న కనిగిరిలో జరిగే ఏఎంసీ ప్రమాణ స్వీకారానికి మండల ప్రజలు తరలి రావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి తెలిపారు. ఏఎంసీ చైర్మన్‌గా సాల్మన్‌ను ఎంపిక చేయడంపై ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్‌కు అభినందనలు తెలిపారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

జరుగుమల్లి: మండల పరిధిలోని కె.బిట్రగుంట గ్రామంలో ప్రసిద్ధిగాంచిన కాల భైరవ స్వామి దేవాలయంలో సోమవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం అనంతరం స్వామివారి మూలవిరాట్‌ను ఆలయ అర్చకులు శ్రీనివాస రావు ప్రత్యేకంగా అలంకరించారు. సహస్ర నామార్చన అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర శాంతి హోమం నిర్వహించారు. పలువురు భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి ని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజా, హోమ కార్యక్రమంలో పలువురు భక్తులు, ఆలయ మరొక అర్చకులు మురళీకృష్ణ శర్మ పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కుష్టు నివారణ అధికారి

హనుమంతునిపాడు: కుష్టువ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కనిగిరి డివిజన్ కుష్టు నివారణ అధికారి కోటపాటి ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు సాధారణ వ్యాధులు, కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలున్నా, ఎర్ర మచ్చలు, తెల్లమచ్చలు ఉన్నా వెంటనే చర్మవ్యాధుల డాక్టర్‌ను సంప్రదించాలని సూచించి వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాఠశాల హెచ్ఎం జీవీ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు సుబ్బారావు, బ్రహ్మయ్య, నాలి వెంకటయ్య, ఎలిక వెంకటేశ్వర్లు, నాగయ్య, రామయ్య విద్యార్థులు పాల్గొన్నారు.